హైదరాబాద్ వార్త



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్





# వజ్రోత్సవ సంబురం

### సాంస్కృతిక సంబరాల మధ్య స్వాతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు
### అదరగొట్టిన శంకర్ మహదేవన్ గానం

హైదరాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త : స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహ ముగింపు వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం ఎల్బీస్టేడియంలో అట్టహాసంగా జరిగాయి. కళాకారుల నృత్యాలు, గాయకుల సంగీత ప్రదర్శనలతో ఆద్యంతం సందడిగా సాగింది. స్వరశిఖరం.. బాలీవుడ్ సంగీత దర్శకుడు శంకర్ మహదేవన్ తన గానంతో తుపాను సృష్టించారు. శంకర్ మహాదేవన్ తన గాత్రంతో అందర్నీ మైమరిపించారు. గణనాయకాయ పాటతో తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ముగింపు వేడుకలకు రాష్ట్రం నలమూలల నుంచి ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. ఈ వేడుకల్లో సిఎం కెసిఆర్ పాల్గొని స్టేడియంలో మొదట మహాత్మాగాంధీకి సిఎం నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి, జెండావందనం చేశారు.

**భారీగా ట్రాఫిక్ జామ్..** ఎల్బీస్టేడియంలో స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకల నేపథ్యంలో సభ జరుగుతున్న పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గంటల తరబడి వాహనాదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎల్బీస్టేడియం వైపు వాహనాలకు అనుమతి ఇవ్వకపోవడంతో అబిడ్స్, నాంపల్లి, లిబర్టీ, బషీర్‌బాగ్ పరిసర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కొందరు వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సాయంత్రంపూట కావడంతో కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్తున్నవారు, విద్యార్థులు, ఉద్యోగులు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడ్డారు.





## భర్త వేధింపులకు భార్య ఆత్మహత్య



నిజాంపేట్, ఆగష్టు 22 ప్రభాతవార్త : భర్త వేధింపులు తాళలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్న ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ముమ్మిడి స్పందన(35) భర్త ప్రసాద్, కుమారుడితో కలిసి భవ్య ఆనందం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం తీవ్రస్థాయిలో గొడవలు జరగడంతో మనస్తాపానికి గురైన స్పందన రాత్రి 10గంటల సమయంలో గదిలోకి వెళ్ళి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారితో సహాయంతో భర్త తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేళాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దింపి స్థానిక హోలిస్టిక్ ఆసుపత్రికి తరలించగా స్పందనను పరిశీలించిన వైద్యులు మృతి చెందిందని ధృవీకరించారు. స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చెరుకున్న కుటుంబ సభ్యులు భర్త వేధింపులు భరించలేకే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని, ఉరివేసుకున్న సమయంలో భర్త ఇంట్లోనే ఉన్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ఏళ్లు గడుస్తున్నా..
# సాగని పనులు

- అంబర్‌పేట్ - ఉప్పల్ ఫ్లై ఓవర్ కోసం 2018న శంకుస్థాపన చేసిన గడ్కరీ
- అయినా పనులు కదలని వైనం

నేడు సందర్శించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ఒక్క పిల్లర్‌కే పరిమితమైన ఫ్లై ఓవర్ పనులు

హైదరాబాద్ ఆగస్టు 22 ప్రభాతవార్త : హైదరాబాద్‌లో కొన్ని రహదారుల పనులు మాత్రం ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడమే లేదు. కొన్నాళ్లు ఒక వైపు రహదారిని కూడా పూర్తిగా మూసేయడంతో జనం మరింత కష్టాలు పడ్డారు. ఇప్పటికీ ఈ రోడ్డు ..వానొస్తే అడుగులోతు గుంతలమయం.. హైదరాబాద్ లోనే ఇలాంటి రహదారులు ఉన్నాయంటే ఇక జిల్లాలలో ఎలా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదని పలువురు గుర్తు చేస్తున్నారు. అంబర్‌పేట్ ఛే నెంబర్ నుండి ఉప్పల్ వరకు నిర్మించ తలపెట్టిన నాలుగు వరుసల ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఎక్కడేసిన గొంగళి అక్కడేనన్న చందంగాఉన్నాయి. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2018 సంవత్సరం మే 5వ తేదీన రాష్ట్ర మంత్రుల సమక్షంలోనే శంకుస్థాపన చేశారు. అప్పటి నుండి ఇప్పటి దాకా కేవలం రహదారి చుట్టు ఉన్న భవనాల కూల్చివేతనే తప్పితే రోడ్డు పనులు సాగడం లేదు. అంబర్‌పేట చౌరస్తా వద్ద నుండి నాలుగు వరుసలలో నిర్మించే ఈ ఫ్లై ఓవర్ కోసం 186.71 కోట్లు వ్యయం కానుండగా ఇందులో ఒక్క భూ సేకరణకే రూ. 40 కోట్లు వ్యయం కానుందని గతంలో అంచనా వేశారు. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం 226. 88 కోట్లుగా నిర్ధారించారు. పనులు ముందుకు సాగక ఎక్కడి ట్రాఫిక్ అక్కడే జామ్ అవుతూ ప్రయాణికులకు తీవ్ర అవస్థతల పాలు చేస్తోంది. వర్షాకాలంలో వానలు ఒక వైపు, గుంతల మయమైన రహదారి మరో వైపు ఇలా ఏళ్లు గడుస్తున్నా పనులు ఎందుకు జరగడం లేదో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఒక వరుస రెండు వరుసలు కాదు నాలుగు వరుసల ఈ వంతెన ఎప్పటికి పూర్తి అయి అందుబాటులోకి వస్తుందో మరి! ఇది పూర్తయితేనే ట్రాఫిక్ జామ్ కష్టాలు తీరుతాయని జనం అంటున్నారు. శంకు స్థాపన చేసినప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన పనులు అరకొరనే మరి. ఒక్క ఛే నెంబర్ రహదారి వద్ద మాత్రమే ఒక్క చోటనే ఒక పిల్లర్ పూర్తి చేస్తున్నారు. ఇలాంటి పిల్లర్లు పూర్తవ్వడానికి ఇంకెన్నాళ్లు పడుతుందోనంటున్నారు. ఇక ఉప్పల్ జంక్షన్ నుండి వరంగల్ రహదారిలోని సిపిఆర్ఐ వరకు (6.25 కి.మీ) మేర నిర్మిస్తామని చెప్పిన ఆరు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు ఎప్పటికీ పూర్తి అవుతాయో కూడా ఎవరికీ తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

**నేడు సందర్శించనున్న కిషన్‌రెడ్డి..** అంబర్‌పేట – ఉప్పల్ నాలుగు వరుసల ఫ్లై ఓవర్ పనుల తీరును పరిశీలించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మంగళవారం నాడు రానున్నారు. తాను ఎంఎల్ఏగా ఉన్నపుపడు ఈ రహదారి ఎలా ఉందో ఇప్పుడు అలాగే ఉండడం.. పైగా రోడ్డు నిర్మాణం కోసం పక్కన ఉన్న భవనాలను కూల్చిన తీరు నేపథ్యంలో కిషన్ రెడ్డి అంబర్‌పేట పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. గృహాలను కొన్నింటినీ కూల్చినా నష్టపరిహారంగా చెల్లించాల్సిన డబ్బులు ఇంకా ఇవ్వనే లేదు. వారంతా కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇటు రాష్ట్ర సర్కారు పెద్దలు ఎప్పుడు వస్తారా అని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానిక వర్గాలు చెబుతున్నారు. కాగా రహదారి పనుల్లో కేంద్రవాటా ఇప్పటికే చెల్లించినట్లు కూడా వార్తలు వినిపిస్తుండగా ఆలస్యానికి బాధ్యత కేంద్రానిదే అని ఇటు రాష్ట్ర మంత్రులు చెబుతున్నారని అంటున్నారు. ఎవరి బాధ్యత ఎంతనో నేటి కిషన్‌రెడ్డి పర్యటనలో మరో సారి బట్టబయలు కానుందంటున్నారు.

# భద్రతకు తిలోదకాలు

### పరిశ్రమలలో నిఘా లోపం.. కార్మికులకు శాపం..
### జీడిమెట్ల పారిశ్రామికవాడలో వరుస అగ్నిప్రమాదాలు

జీడిమెట్ల, ఆగష్టు 22 ప్రభాతవార్త : జీడిమెట్ల పారి శ్రామికవాడలో వరుసగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పరిశ్రమలల్లో ప్రమాదాలు నివారించే నిఘావ్యవస్థ నిద్రమత్తులో తూలుతుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ఉంది. పరిశ్రమల యాజమాన్యల పనితీరు. మొన్న ఎస్ఎస్‌వి ఫ్యాబ్రికేషన్ పరిశ్రమలో భారి అగ్ని ప్రమాదంతో పెద్దఎత్తున ఆస్తినష్టం.. ఎఆర్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, పరిశ్రమలో అగ్నిప్రమాదం మరువక ముందే నేడు ఎస్‌వీ కోఆపరేటివ్ సొసైటీలోని శ్రీధర కెమికల్స్ లో రియాక్టర్ పేలి భారి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులకు తీవ్ర గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. రియాక్టర్ల పేలుడు ధాటికి ఆ ప్రాంతంలోని పరిశ్రమ యజమానులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. నిజాంపేట క్రాస్ రోడ్డులో హోలిస్టిక్ ఆసుపత్రిలో దట్టమైన పొగలు అలుముకొని రోగుల ఆర త్నాదాలు...రేపు ఎక్కడ..ఎప్పుడు ప్రమాద ఘంటికలు మోగుతాయోనని కార్మికులు బిక్కుబిక్కుమంటు విధులు నిర్వహిస్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో పెద్దఎత్తున ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు తమ సిబ్బందితో హడావుడి చేసి అనంతరం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శవుంది. యాజమాన్యాలు పరిశ్రమలలో కార్మికుల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు సంభవించినప్పుడు వారి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మరికొందరు అంగవైకల్యంతో బ్రతుకు జీవుడా అంటు కుటుంబానికే భారం అవుతున్నారు. ప్రభుత్వం కార్మికులకు ఎన్ని చట్టాలు చేసి అమలు పరిచిన అవి యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్నాయి. ఉన్న ఊరిని.. కన్నవారిని వదిలి బ్రతుకుదెరువు కోసం ఉపాదివెతుకుంటూ వచ్చిన వారిని కాంట్రాక్ట్ పేరుతో తక్కువ వేతనాలు చెల్లించి ఏ మాత్రం అవగాహన లేని మిషనరీలు, రియాక్టర్‌ల వద్ద పనులు చేయిస్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కెమికల్ కంపెనీలలో ప్రమాదాలు పొంచి ఉంటాయని తెలిసిన జీవనోపాధి కోసం కార్మికులు విధులు నిర్వహిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. పరిశ్రమలలో షాట్‌సర్క్యూట్, రియాక్టర్స్, డ్రయర్స్ పేలడం, కంపెనీ భవనాలు కుప్పకూలడం, పెద్దఎత్తున ఆస్తీ ప్రాణా నష్టం జరుగుతున్నా భద్రత లోపాలపై చర్యలు లేకపోవడం.. ప్రమాదాలతో గంటల తరబడి దట్టమైన పొగలు వ్యాపించడం ప్రాణసంకటంగా మారింది. ఆసియా ఖండంలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందిన జీడిమెట్ల పారిశ్రామిక వాడలో నిత్యకృత్యంగా మారింది. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జీడిమెట్ల పారిశ్రామిక వాడలో సుమారు 11వందల పైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో కెమికల్స్, డ్రగ్స్ కంపెనీలు అధికంగా ఉన్నాయి. ఇక్కడి పరిశ్రమలల్లో శాశ్వత, కాంట్రాక్ట్ పేరుతో సుమారు 40వేల వరకు కార్మికులు వివిధ రూపాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. కాంట్రాక్ట్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ప్రమాదాలలో మరణించిన కార్మికులకు మొక్కుబడిగా డబ్బులు ముట్టచెప్పి సంబంధిత అధికారులకు మామూళ్ళతో సరిపెట్టి ఎలాంటి కేసులు రాకుండా చూసుకోవడంలో యాజమాన్యాలు సఫలికృతులౌతున్నారు.



తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న కార్మికులు



అగ్నిప్రమాదంతో వ్యాపిస్తున్న దట్టమైన పొగ

**ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నిఘా ఎక్కడా..** జీడిమెట్ల పారిశ్రామిక వాడల్లో ప్రమాదాల నివారణపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు నిఘా లేకపోవడంతో యాజమాన్యాలకు వరంగా మారింది. సంపాదనే ధ్యేయంగా పరిశ్రమల యాజమాన్యాలు ఉత్పత్తి ప్రక్రియలో కార్మికులకు ఎలాంటి రక్షణ పరికరాలు ఇవ్వకుండానే పనులు చేయించుకోవడంతో వారు మృత్యువాత పడుతుండడంతో అతనిని నమ్ముకున్న భార్యపిల్లలు అనాథలుగా వీధిన పడుతున్నారు.

**కెమికల్, డ్రగ్స్ ఉత్పత్తులపై అధికారుల నియంత్రణ కరువు..** అధికారులు పరిశ్రమల యజమానులకు అనుమతులు, లైసెన్స్‌లు మంజురీ చేయడంలో చూపిన శ్రద్ధ వాటి ఉత్పత్తులపై చూపడం లేదని విమర్శ ఉంది. దీనితో యాజమాన్యాలు అనుమతులు లేని ఉత్పత్తులు కొనసాగిస్తూ కాలుష్యాని పెంచిపోషిస్తున్నారు. పారిశ్రామిక వాడలోని కంపెనీలు ఎలాంటి ఉత్పత్తులు చేపడుతున్నారో సంబంధిత అధికారుల వద్ద సమాచారం ఉండదు. ఏదోఒక ప్రమాదం జరిగినప్పుడే కంపెనీ పేరు బయటికి రావడంతో అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని అనుమతి లేదంటూ చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో కొన్ని పరిశ్రమలు ఎలాంటి బోర్డులు లేకుండా గుట్టుగా తమ ఉత్పత్తులను చేస్తుంటారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయన డ్రమ్ములను భద్రపరచడం, ప్రమాదమైన రసాయనాల వద్ద కార్మికులను పనిచేయించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏది ఏమైన అక్రమసంపాదనకు అలవాటుపడి కార్మిక చట్టాలను కాలరాస్తున్న పరిశ్రమల యాజమాన్యాలను గుర్తించి వారిపై కొరడా జులుపించి కార్మికుల సంక్షేమానికి కృషి చేయల్సిన భాద్యత సంబంధిత అధికారులపై ఉంది.

# కష్టానికి.. తగిన వేతనమేది..?

- కూలీలకు గిట్టుబాటు ధర ఇప్పించాలి
- ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో పార్సిల్ విభాగపు కార్మికుల వేడుకోలు

కనీసం రోజుకు రూ. 900 నుండి వెయ్యి రూపాయల కూలీ పడేలా చూడాలని కూలీలు యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



### రోజు వారీ కూలీ రూ. 7 వందలు కూడా దాటడం లేదంటూ ఆవేదన
### టిఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీసెస్‌తోనైనా పెంచాలని డిమాండ్

మహాత్మాగాంధీ, జూబ్లీ బస్ స్టేషన్లలో రోజు వారీగా 350 మంది వరకు కార్మికులు రోజు వారీ పనుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. జూబ్లీబస్ స్టేషన్‌తో పోలిస్తే మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లోనే ఎక్కువ మంది కూలీలు రోజువారీ పనుల్లో బిజీబిజీగా కనిపిస్తుం టారు. జిల్లాల నుండి వచ్చే ఆర్‌టిసి బస్సుల నుండి అన్ లోడింగ్ చేయడం లేదా జిల్లాలకు వెళ్లే బస్సులకు లోడింగ్ చేయ డం వీరి విధుల్లో ప్రధానమైన అంకం. అర్ధరాత్రి మొదలు తెల్లవారు ఝాము నుండి కూడా తమలో కొందరు పని చేస్తుంటారని జిల్లాల కు వెళ్లే బస్సులలో వార్తా పత్రికలను పంపించడం ఒకటైతే పార్సిళ్లతో పాటు ఇతర సమాగ్రిని బస్సుల్లో ఎక్కిస్తుంటామని వారు చెబుతున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త : ప్రజా రవాణా సంస్థ టిఎస్ ఆర్‌టిసిలో కార్మికులకు సరిపడా వేతనాలు లభిం చడం లేదా? పని గంటలకు తగ్గట్టు వేతనాలు ఇవ్వడంలో మేనేజ్‌మెంట్ వెను కంజ వేస్తోందా ? అంటే కార్మికుల నుం డి ఔననే సమాధానం వస్తోంది. ఏ కూలీ పనులు దొరకక ఆర్‌టిసి బస్టాండ్ లలో పని చేసేందుకు విధుల్లో చేరామని చెబుతున్న కార్మికులు తమకు సరిపడా గిట్టుబాటు ధరల్లో రోజు వారీ కూలీలు దొరకడం లేదంటున్నారు. పని చేసే సమయం కూడా ఎనిమిది నుండి పది గంటల సమయం చేయాలని చెబుతున్నారని అందుకూ తాము అంగీకారంతోనే చేస్తున్నామని అంటున్నారు. పార్సిల్ సెక్షన్‌లో పని ఉదయం ఆరు గంటలకే మొదలవుతుందని, కాస్త ఆలస్యమైనా అధికారుల నుండి చివాట్లు తప్పడంలేదని కార్మి కులు చెబుతున్నారు. గ్రామాలలో పనులు దొరకక లాక్‌డౌన్ సమయంలో హైదరాబాద్‌కు వచ్చి పనులు వెతుకుతున్న సమయంలో ఆర్‌టిసి తమను కూలీ పనులకు కుదుర్చుకుందని అందుకు ఆర్‌టిసి యాజమాన్యానికి తాము రుణపడి ఉంటామని చెబుతూ.. రోజువారీ కూలీ ధరలు సరిపోవడం లేదంటున్నారు. కొన్ని సందర్భాలలో కేవలం రూ. 650 కూడా చెల్లిస్తున్నారని అదేమని అడిగితే ఆలస్యంగా విధుల్లో చేరావు కదా అని అధికారులు బదులిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు.

**పార్సిళ్లు తేడా వస్తే తమపైనే ఒత్తిడి..** హైదరాబాద్ నుండి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ లాంటి జిల్లాలకు పార్సిళ్లను పంపించే క్రమంలో ఆయా పార్సిళ్లు తేడా వస్తే తమనే బాధ్యులను చేస్తున్నారంటున్నారు. వెళ్ల బోయే బస్సు నెంబర్ పార్సిల్ సంఖ్యను చూసుకుని మరీ రాసుకోక తప్పడం లేదని, ఉదా.. 10 పార్సిళ్లు పంపాల్సిన చోట ఎనిమిదో, తొమ్మిదో పంపి ఒకటి అర మిగిలి పోతే చివరికి తమనే బాధ్యులను చేస్తున్నారని కూలీలు చెబుతున్నారు. కాగా టిఎస్ ఆర్‌టిసి లాజిస్టిక్ సర్వీసెస్ (కార్గో, పార్సిల్) విభాగంలోనే వీరికి పనులు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ క్రమంలో కార్మికుల పని తీరును ఎప్పటికప్పుడు మాని టరింగ్ చేసేందుకు ఆర్‌టిసి యాజ మాన్యం ఇటీవలే ఓ అధికారిని ఏర్పాటు చేసింది. సదరు అధికారి పర్యవేక్షణలో పార్సిల్ విభాగాన్ని మరింత పరిపుష్టం చేసే దిశగా ఆర్‌టిసి యాజమాన్యం ఆలోచిస్తోందని, ఇప్పటికే 25 బుకింగ్ కౌంటర్ల ద్వారా లాజిస్టిక్ సర్వీసులు ఎక్కువగా జరిపించేందుకు ఆర్‌టిసి మేనేజ్ మెంట్ నిర్ణయించిందని కూలీలు చెబుతున్నారు. సంస్థ బాగోగుల్లో తాము కూడా భాగస్వాములమేనని, తమకు చెల్లించే కూలీ రోజుకు రూ. 600 నుండి రూ. 700లకు మించడం లేదని సదరు కార్మికులు చెబుతున్నారు. కనీసం రోజుకు రూ. 900 నుండి వెయ్యి రూపాయల కూలీ పడేలా చూడాలని వారు యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# పెన్షన్ దరఖాస్తులకు మోక్షం

రాష్ట్రంలో హైదరాబాద్‌లోనే అత్యధికమందికి లబ్ధి : అధికారులు

- జిల్లాలో కొత్తగా 81,293మందికి ఆసరా పెన్షన్
- లబ్ధిదారులకు కార్డులు అందజేస్తున్న అధికారులు
- కొత్తవారికి సెప్టెంబర్ నెల నుంచి నగదు అందజేత
- అత్యధికంగా 57ఏళ్ల వయసు వారికి మంజూరు

హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభావతార్త: ఆసరా పథకంలో భాగంగా వృద్ధులు, వితంతులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత, బిడి కార్మికులు, ఆర్టిస్టులు, బోదకాలు వ్యాధిగ్రస్తులకు నెలనెలా ఫించన్లు అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత కొన్నేళులగా అర్హత ఉండి దరఖాస్తు చేసుకుని పెన్షన్‌కోసం ఎదురుచేస్తున్న వారికి మోక్షం లభించింది. ఇటీవల ప్రభుత్వం కొత్త పెన్షన్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో ఎన్నోఏళ్లుగా దరఖాస్తులు చేసుకుని ఎదురుచూస్తున్నవారిలో మళ్లీ ఆశలు చిగురించాయి. ఈనేపథ్యంలో తాజాగా హైదరాబాద్ జిల్లాలో 81.293 మందికి ఫించన్ మంజూరు చేసింది. గతంలో దరఖాస్తు చేసుకున్న 65 ఏళ్ల వృద్ధులతోపాటు 57ఏళ్లవయస్సు వారికి పెన్షన్ మంజూరు చేసింది. జిల్లాలోని 16రెవెన్యూ మండలాల పరిధిలో వివిధ కేటగిరీల్లో ప్రస్తుతం 1లక్షల 98వేల మంది ఆసరా పెన్షన్ పొందుతన్నారు. అందులో 58,607మంది వృద్ధులు ఉండగా ,22,686మంది ఇతర విభాగాలకు చెందిన వారు ఉన్నారు. కొత్త లబ్ధిదారుల్లో 80శాతం మంది 57ఏళ్ల వయస్సు వారే ఉండగా 20శాతం 65ఏళ్ల వయస్సు వారు ఉన్నట్లు అదికారులకు తెలిపారు. రాష్ట్రంలో హైదరాబాద్‌లోనే అత్యధికమంది లబ్ధిపొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కొత్త పెన్షన్ దారులకు సెప్టెంబర్ నెల నుంచి నగదు అందజేయన్నట్లు ఆధికారులు పేర్కొం టున్నారు.





**లబ్ధిదారులకు పెన్షన్ కార్డులు అందజేత..**

పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు అధికారులు కార్డులు అందజేస్తున్నారు. పలుప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్లు, ఎమ్మె ల్యేలు, మంత్రుల ద్వారా కార్డులు అందజేస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులు అధికారులకు వద్దకు వెళ్ళి కార్డు తెచ్చుకుంటున్నారు. దీంతో కార్డు చేతికి అందడంతో తమకు పెన్షన్ వస్తుందని పలువురు వృద్ధులు అనందం వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ వజ్రోత్సవ వేడుకులకు తరలిన గులాబి దండు

**ఖైరతాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో నగరంలోని స్టేడియంకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బస్తీల, కాలనీల నుంచి గులాబిదండు పయనించి జై తెలంగాణ.. జై కెసిఆర్ అంటూ నినాదాలు హోరెత్తించారు. దానంనాగేందర్ ఆదేశానుసారం ఖైరతాబాద్‌లోని డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో గులాభిదండు కదలిచినట్లయింది. మరోవైపు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రధాన రహదారుల, చౌరస్తాల మార్గాలలో అవసరమైన బందోబస్తును రంగంలోకి దించారు. నగర పోలీసు కమిషనర్ నేతృత్వంలో సెంట్రల్ జోన్ డిసిపి, ఎసిపిల ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్నటువంటి సిఐలు, సిబ్బందిని ఏర్పాటు చేసి బందోబస్తు కోసం సిద్ధం చేశారు. వైభోవోపేతంగా నిర్వహించుకునేందుకు సన్నద్ధం చేశారు.

## విద్యార్థులకు పిజెఆర్ పౌండేషన్ ద్వారా నోట్ పుస్తకాల పంపిణీ

**ఖైరతాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** పిజెఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో ట్రస్టీచైర్మన్, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేశారు. భవిష్యత్తులో విద్యార్థులు మంచిగా రాణించాలన్న సంకేతాలు, పలు సందేహాలకు విజయారెడ్డి హితవు బోధించారు. ఈ కార్యక్రమాలలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా, పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి బోయలను ఎస్టీజాబితాలో చేర్చాలని ధర్నా

**గోషామహల్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** వాల్మీకి బోయలను ఎస్టీజాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వాల్మీకి బోయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి సభ్యులు ఈ.వి.రమణ, బోయలక్ష్మ న్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నప్పటికి వాల్మీకిబోయలు, విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాలల్లో వెనుకబడిఉన్నట్లు వారు ఆవేధన వ్యక్తం చేశారు. వాల్మీకి బోయలు సంచార జీవనం కొనసాగిస్తూ ఆడవులనే ఆసరగా చేసుకుని చిరు జంతువులను వేటాడి జీవించేవారన్నాని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం విముక్తజాతులుగా గుర్తించి ఎస్టీ జాబితాలో కొనసాగించారు. ఆటవిక జీవితం నుండి మైదాన ప్రాంతానికి నెట్టివేయబడినట్లు గుర్తుచేశారు. గిరిజన తెగల అధ్యాయనం కోసం డాక్టర్ చెల్లప్ప కమిటి నియమించి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేధికను ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించినప్పటికి నేటికి వాల్మీకి బోయల ప్రస్తావన లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గట్టుసాయి, బొగ్గువెంకటేష్, వెంకటేశ్వర్లు, గోపాతులకు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందచేస్తున్న వాల్మీకిబోయ ప్రతినిధులు

## కేంద్ర, జిల్లా నాయకులకు సన్మానం

**గన్‌ఫౌండ్రి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** టిఎన్‌జిఓ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, సేవారత్న డాక్టర్.ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తనదైన శైలిలో, హైదరాబాద్ జిల్లాలో సేవా భావంతో పని చేస్తున్న కార్యవర్గ సభ్యులకు యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులకు, సాంఘీక, సేవ కార్యక్రమాలతోపాటు యూనియన్ లోగోతో కలిగి బ్యాడ్జ్‌తో టిఎన్‌జిఓ కేంద్ర, సంఘం అధ్యక్షులు, మామిళ్లరాజేందర్, ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రతాప్, జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీలను ఘనంగా పూలమాల వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, కె.శ్రీనివాస్, భూపాలపల్లి అధ్యక్షులు కె.రవికుమార్, ఉమాదేవి, కోండల్‌రెడ్డి, సంతోష్, టిఎన్‌జిఓ ప్రతినిధులు పాల్గొన్నారు.



సన్మానం చేస్తున్న దృశ్యం

## ఘనంగా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి వేడుకలు



వేడుకలను జరుపుకుంటున్న అధికారుల దృశ్యం

**నార్సింగి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** నిజాం పాలనలో హైదరాబాద్ నగరం తొలి హిందూ కొత్వాల్ రాజా బహదూర్ వెంకట రామారెడ్డి 154 వ.జయంతి వేడుకలు తెలంగాణ పోలీసు అకాడమిలో ఘనంగా నిర్వహించారు. సోమ వారం హైదరాబాద్ నగర శివారుల్లో ఉన్న పోలీసు అకాడమిలో ఉన్న ఆయన విగ్రహానికి అకాడమి డైరెక్టర్, అడిషనల్ డీజీపి వి.వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘ న నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరా నికి 14.సంవత్సరాల పాటు కొత్వాల్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించి, శాంతి భద్రతలను కాపాడారని తెలిపారు. సుధీర్ఘకాలం సమర్థవంతంగా విధులు నిర్వహించిన రాజా బహదూర్ వెంకట రామారెడ్డికి కింగ్ జార్జ్-5 "ఆర్డర్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్" అనే బిరుదు ఇచ్చారని గుర్తు చేశారు. అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా, సుధీర్ఘకాలం నిర్వహించి ప్రజలు, పాలకుల మన్ననలు పొందిన కొత్వాల్, నేటి పోలీసు అధికారులందరికి ఆదర్శంగా నిలిచారని వివరించారు. ఇతడి పేరుపైనే తెలంగాణ పోలీసు అకాడమి నడుస్తుండడం గర్వంగా ఉందన్నారు. పాఠశాలలు, విద్యా సంఘాలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు రెడ్డీ హాస్టల్‌నే ఏర్పాటు చేయించి సమాజానికి అనేక సేవలు అందించారని శ్రీనివాసరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమి జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయుడు, డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ నవీన్ కుమార్, గిరిధర్ రావుల, రాధేష్ మురళీ, రాఘవేందర్‌రెడ్డి, వైవిఎస్ సుధీంధ్ర, పిఎస్‌ఆ.మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు ర వీందర్‌రెడ్డి, నర్సిహ్మారెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసాచార్యులు, రమణ, భూపాల్, శ్రీదేవి, జానకీ ష ర్మిల, డిఎస్‌పిలు, ఆర్.ఐలు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

## సురాభాండేశ్వర గౌండ్ల మఠంలో శ్రావణమాసం ముగింపు వేడుకలు



సురాభాండేశ్వర గౌండ్ల మఠంలో అన్నదాన దృశ్యం

**జియాగూడ, ఆగస్టు 22, ప్రభాతవార్త :** సురాభాండేశ్వర గౌండ్ల మఠంలో ఘనంగా శ్రావణ మాస మహోత్సవాలు ముగిసాయి. సోమవారం శ్రీసురాభాండేశ్వర ఆలయంలో ప్రత్యేకపూజలుచేసి మహాఅన్నదానంచేశారు. ప్రతిరోజు వివిధ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం చివరి సోమవారం అభిషేకం ఆఖండ హారతి పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ ముఖ్యసలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్రబాస్కర్‌గౌడ్, గోదా వెంకటేష్‌గౌడ్, ధర్మకర్తపాలకమండలి అధ్యక్షులు గోడిశాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్తనవీన్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షులు యజ్ఞశ్వర్‌గౌడ్, కోశాధికారి నిర్మల మనుజందర్‌గౌడ్, ఐలెన్‌గౌడ్, పంజాల అశోక్‌కుమా ర్‌గౌడ్, సభ్యులు ప్రవీణ్‌కుమార్‌గౌడ్, మల్లంశివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి సంగీతం మానసిక ప్రశాంతతను అందిస్తుంది



గాయనీ గాయకులను సత్కరిస్తున్న దైవజ్ఞ శర్మ తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** అక్కిరాజు రిషి మ్యూజికల్ ఈవెంట్స్ అధినేత్రి యోగిత అక్కిరాజు ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన సుప్రసిద్ధ సినీనటులు మెగాస్టార్ చిరంజీవి నటించిన చిత్రాల నుంచి పాడిన పాటలు అందరిని అలరించాయి. గాయనీ గాయకులు స్నేహా, ఇందునయన, అపర్ణ, జ్యోతి, నీరజ, కల్యాణ్, రామసుబ్రహ్మణ్యం, శివరామ కృష్ణ, చంద్రబోస్, శ్రీనివాస్, రవి, గోపిచంద్, కె.రవి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రమేశ్‌బాబు, శోభన్, రాఘవ, రిషి, శ్రావణ్, కిషోర్, నాని, సత్యం కులకర్ణి తదితరులు పాడిన పాటలు అందరిని అలరిం చాయి. ఈ కార్యక్రమంలో జీఎస్టీ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఫిలిం ప్రొడ్యూసర్ వి.మురళీధర్ తదితరులు పాల్గొని గాయనీ గాయకులతో పాటు నిర్వాహక సంస్థ అధినేత యోగితా అక్కిరాజు, ప్రభంజన్ అక్కిరాజులను సత్కరించి అభినందించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** విద్యుత్ మర మ్మతులు కారణంగా 23వ తేదీ మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సు ల్తాన్‌షాహి, గౌలిపుర ప్రాంతాలలో, 2 నుంచి 4 గంటలు వరకు సుల్తాన్‌షాహి, మీరాకాదర్గా, బేలా బస్తీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు

## అకౌంట్స్ అధికారుల బదిలీలు పారద్శకంగా జరిగాయి

### - అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** విద్యుత్ సంస్థ టిఎస్ఎస్‌పిడిసిఎల్ బదిలీలో 2022లో భాగంగా అకౌంట్స్ అధికారుల బదిలీలు పారదర్శకంగా జరిగాయని విద్యుత్ అకౌంట్స్ఆఫీసర్స్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. సంస్థలో పనిచేస్తున్న అందరికీ ఆమోద యోగ్యంగా బదిలీలు జరిగాయన్నారు. ఈసందర్భంగా బదిలీలలను పారదర్శకంగా ఇచ్చినందు కు సిఎండీ రఘుమారెడ్డిని ప్రతినిధులతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



సిఎండీ రఘుమారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న అంజయ్య తదితరులు

## ఫిస్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలి

### - జంపనప్రతాప్

**కంటోన్మెంట్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** తెలంగాణలో ఫిస్ట్ బాల్ క్రీడాకారులు ప్రతిభకనబర్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలలో ప్రతిభకనబర్చాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ జంపనప్రతాప్ తెలిపారు. సోమవారం బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ లో తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ జనరల్ బాడా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సిద్ధిపేటలో ఫిస్ట్ బాల్, సబ్ జూనియర్, ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు కొందరు దాతలు కూడా ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిస్ట్ బాల్ వ్యవస్థాపక కార్యదర్శి జగన్ మోహన్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకట్, సలహా దారులు విక్రమ్ చిన్నా ప్రతినిధులు విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తె లంగాణలోని వివిధ జిల్లాల ఫిస్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.



జంపనప్రతాప్‌ను అభినందిస్తున్న ఫిస్ట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

## నిరుద్యోగులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** నెదర్లాండ్ కెనెడా దేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన కన్సల్టెన్సీ సంస్థపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితుడు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాస్‌తో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్,తమిళనాడు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తగా ఇతర రాష్ట్రాల్లోకూడా విదేశీ కంపెనీలలో వివిధ రకాల జాబ్స్‌లో చేరి స్థిరపడదండని మెసేజ్‌లు అని ప్రచారం చేయగా నమ్మి వారికి తమపాస్‌పోర్టు తోపాటు, డబ్బులు కూడా చెల్లించామన్నారు. కావున ప్రభుత్వం స్పందించిన తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రైలుకు దండంపెట్టి వ్యక్తి ఆత్మహత్య

**తార్నాక, ఆగస్టు 22, ప్రభాతవార్త :** రైలులో అందరు చూస్తుండగానే ఓ వ్యక్తి రైలుకు దండం పెట్టి దాని ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడిన విషాదకర సంఘటన చర్లపల్లి... ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వైపు గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తోంది. రైలు చర్లపల్లి... ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి(35) దాని కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్లో నుంచి ప్రయాణికులు చూస్తుండగానే రైలుకు ఎదురుగా వెళ్లి రెండు చేతులు జోడించి దండం పెడుతూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆదారాలు వారికి లభించలేదు. పోలీసులు మృత దేహాన్ని స్వాదీనం చేసుకొని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

## మునుగోడు బరిలో అఖిలభారత హిందూ మహాసభ అభ్యర్థి !

### ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** త్వరలో జరుగనున్న మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థిని నిలబెట్టే అంశంపై త్వరలో ఒక ప్రకటన చేస్తామని అఖిల భారత హిందూ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రవి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అఖిల భారత హిందూ మహాసభ ప్రత్యేక సమావేశం సోమవారం నాడు అఖిల భారత హిందూ మహాసభ జాతీయ అధ్యక్షుడు త్రిదండి స్వామి శ్రీనివాస్ వ్రతధర్ జీయర్ మహరాజ్ అధ్యక్షతన సీతారాంబాగ్‌లోని జగన్నాథ మఠంలో నిర్వహించామన్నారు. కాగా ఈ సమావేశంలో హిందూ మహాసభ జాతీయ అధ్యక్షుడు త్రిదండి స్వామి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించామని, స్వాతంత్ర్య సమరయోదుడు, అఖండ హిందూ దేశ దార్శనికత కోసం పోరాడిన వీర యోధుడు శ్రీవీర్‌సావర్కర్ స్థాపించిన అఖిల భారత హిందూ మహాసభకు మద్దతు ఇచ్చే అవకాశం ఇప్పుడు మళ్లీ వచ్చిందన్నారు. హిందూ దేవాలయాల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, సనాతన దేవాలయాలకు వచ్చే సొమ్ము ను ఇతర మతాల వారి కోసం వినిగించడాన్ని అఖిల భారత హిందూ మహాసభ ఖండించిందన్నారు.



అఖిల భారత హిందూ మహాసభ సమావేశ దృశ్యం

## అడ్డగుట్టలో ధ్వంసమైన రోడ్లు

### - పట్టించుకోని అధికారులు

**అడ్డగుట్ట, ఆగస్టు 22, ప్రభాతవార్త :** అడ్డగుట్టలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. మరమ్మత్తులు చేయించడంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు వ్యక్తం చేశారు. ముఖ్యంగా అడ్డగుట్టలో ఉన్న మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయం,ప్రభుత్వ ఆసుపత్రి, తుకారాంగేట్ పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో నిరంతరం డ్రైనేజీ ఏరులై పారుతున్న రోడ్లు, శిథిలావస్థలో ఉన్న పట్టించుకునే నాధుడే కరువైయ్యాడు. ఆ ప్రాంతం వైపు వెళ్లే ప్రజలు, వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గాన్ని మరమ్మత్తు చేపట్టాలని అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంట రాజు సాగర్, డిమాండ్ చేశారు.

## కళలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలి

### - అక్కిరాజు సుందరరామకృష్ణ

**చిక్కడపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** కళలను, కళాకారులను, సాహిత్యాభిమానులను ప్రతి ఒక్కరు ఆదరించి గౌరవించాలని ప్రసిద్ధ కవి, నటులు, గాయకులు డాక్టర్ అక్కిరాజు సుందరామ కృష్ణ అన్నారు. రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 'గీత కదంబం' కార్యక్రమం ఆ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అక్కిరాజు సుందరామకృష్ణ హాజరవగా ఈ సందర్భంగా గాయనీ గాయకులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి, గంటి విశాలాక్షి, కర్రా శ్రీనివాస్, కెఎన్‌వి.సుబ్రహ్మణ్యం అద్భుతంగా గానం చేశారు. మంచి సంగీతం మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని అన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అక్కిరాజుసుందరరామకృష్ణ, రమణకుమారి, సుబ్బలక్ష్మి

## ఐలా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

**జీడిమెట్ల, ఆగస్టు 22, ప్రభాతవార్త :** 75వ భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా జీడిమెట్ల నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ (ఐలా) చైర్మన్ సదాశివరెడ్డి సోమవారం బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నేటి యువత ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం సంపాదించాలనే తపనతోనే ఉన్నారని, అలా కాకుండాస్వయంగా అంకుర సంస్థలు స్థాపించి ఉద్యోగాలు సృష్టించే విధంగా వారి ఆలోచనలు ఉండాలన్నారు. ఈ ర్యాలీలో సుమారు 500 బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీఎస్ఐఐసి జోనల్ మేనేజర్ మాధవి, ఐలా వైస్‌చైర్మన్ ఏఎల్ఎన్ రెడ్డి, కమిషనర్ విజయ, కృష్ణ, భాస్కర్‌రాజు, రాజు, రాంతిలక్, ఉద్యోగులు, కార్మికులు, సామాజిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.





## వజ్రోత్సవ ముగింపు ఉత్సవాలు

### మల్లేపల్లి ఐటిఐలో మిఠాయిల పంపిణీ

**హైదరాబాద్ ఆగస్టు 22, ప్రభాతవార్త :** భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ మల్లేపల్లి ఐటిఐలో ఉద్యోగులు పరస్పరం స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఆగస్టు 8వ తేదీ నుండి 22వ తేదీ వరకు వజ్రోత్సవాలలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులకు అభినందన లు తెలియజేసిన అధికారులు ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పాల్గొని ఒకరికొకరు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ పి. జ్యోతిరాణి, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మన్యబోయిన కృష్ణ యాదవ్, ఏమో చంద్రశేఖర్ సూపరింటెండెంట్ గని, ట్రైనింగ్ ఆఫీసర్స్ స్వప్న మల్లేష్ అజయ్ కుమార్ యాదవ్ హుస్సేన్ అలీ ట్రైనింగ్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ సత్యనారాయణ సుధాకర్ రెడ్డి, ఖలీల్, రాజ్ కుమార్ యాదవ్, సందీప్ కుమార్ , ప్రవీణ్ రెడ్డి, భాష తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరికలు



బిజెపిలో చేరిన కాంగ్రెస్ నేతలు

**అడ్డగుట్ట, ఆగస్టు 22, ప్రభాతవార్త :** బిజేపీ పార్టీలో పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మహంకాలి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం.లల్లూ బాయ్ బిజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, సంయుక్తంలో బిజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ప్రముఖ్యత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా లల్లూకు బిజెపి కండువకప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యదర్శి నాగేశ్వర్ రెడ్డి, ఓబిసి కన్వీనర్ నాగపూరి రాజు గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సి.హెచ్.కన్నాభిరామ్, రాజేశ్వర్ రావ్, ఆర్.నందు, వేణుగోపాల్ చారి, శ్రీనివాస్, వీరేశం పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

**నార్సింగి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** విద్యార్థులను విద్యతో పాటు సమాజిక అంశాలలో కూడా ఆల్‌రౌండర్లుగా నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని ఎస్ఎంపి ఇంటరనేషనల్ స్కూల్ డైరెక్టర్ భవ్యారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ హైదర్షాకోట్‌లో ఉన్న పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. గత వారంలో మువ్వన్నెల జెండా తయారీ, స్వాతంత్ర్య సంగ్రామంలపై ఏర్పాటు చేసిన ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవ్యారెడ్డి మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపక గణంతో నాణ్యమైన విద్యాబోధనలు చేస్తున్నామని, విద్యార్థి సమగ్ర వికాసం కోసం అహర్నిషలు కష్టపడుతున్నామన్నారు. విద్యతో పాటు ఆటలు, పాటలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. చిన్న మొక్కగా మా పాఠశాలలో చేరిన విద్యార్థులను మహా వృక్షంగా మార్చి సమాజానికి అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందప్ప యాదవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు అందించిన దృశ్యం

## పురానాపూల్‌లో యువకుడు అదృశ్యం

**చార్మినార్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** పాతబస్తీ పురానాపూల్‌లో ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హుస్సేనీఆలం పోలీసుల కథనం ప్రకారం.... పురానాపూల్‌లోని పార్దివాడకు చెందిన కె.కపిల్ పిట్టల హారతి కాళీవాలా భార్యాభర్తలు. కాగా ఈ నెల 21వ తేదీ రాత్రి భార్యా భర్తల మధ్య డబ్బుల విషయమై వివాదం చోటు చేసుకుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన కె.కపిల్ తిరిగి ఇంటికి రాలేదు. కపిల్ కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికిన ఫలితం లేక పోయింది. దీంతో భర్త కపిల్ కనిపించటం లేదంటూ భార్య హారతి హుస్సేనీఆలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మనమంతా నిజమైన స్వాతంత్ర్యం అనుభవిస్తున్నామా అనేది ప్రతిఒక్కరు ప్రశ్నించుకోవాలి

**చిక్కడపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** దేశం 75 సంవత్సరాల వజ్రోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో దోపిడీ, అవినీతి పెరిగి నిజమైన స్వాతంత్ర్యం అనుభవిస్తున్నామా అనేది ప్రతి వారు ప్రశ్నించుకోవాలని మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషా చైతన్యసమితి, శ్రీ త్యాగరాయ గానసభ, లక్ష్యసాధన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో భారత స్వాతంత్ర్య వజ్రోత్సవ సభ నిర్వాహక సంస్థ అధినేత బడేసాబ్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ కవి, విమర్శకులు గంటా మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పాతిక సంవత్సరాలలో దోపిడీ, అవినీతి అంతగా లేవని, దేశ భవిష్యత్తుపై ఆశాజనకంగా ఉండేదని, కానీ 50 సంవత్సరాల స్వర్ణోత్సవాలలోనూ దోపిడీ ఇంతగా లేదని అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీశంకర్, లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రభురాజు, కళాపోషకులు డాక్టర్ మల్లెపూల వెంకటరమణ, మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ పి.సరోజినిదేవి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఏనుగు నరసింహారెడ్డి

## నేడు చాంద్రాయణ గుట్ట చౌరస్తాలో పై వంతెన ప్రారంభం

**చార్మినార్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట చౌరస్తాలో దాదాపు 45 కోట్ల 87 లక్షల రూపాయలతో నిర్మించిన కొత్త పై వంతెనను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు ప్రారంభించనున్నారని జిహెచ్ఎంసి ప్రాజెక్టు విభాగం సౌత్ జోన్ ఎస్ఈ దత్తు పంత్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరగనునున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ,ఎంఐఎం శాసన సభ పక్ష నాయకులు, చాంద్రాయణగుట్ట నియోజకవర్గం శాసన సభ్యులు అక్బరుద్దీన ఓవైసీ, జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొంటున్నారు.



## పార్టీ విధి విధానాలకు ఆకర్షితులై చేరికలు

**పేట్‌బషీరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ విధి విధానాలకు ఆకర్షితులై ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షుడు దమ్మని శ్రవణ్‌కుమార్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం, సంజయ్‌గాంధీ నగర్‌వాసులు మాజీ ఎంపీపీ కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి దమ్మని శ్రవణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీలో చేరినవారికి కండువాలతో కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలనతో ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులై అధిక సంఖ్యలో పార్టీలో చేరుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జేమ్స్, సంజీవరెడ్డి, పండరిరావు, కౌసల్య, యాదమ్మ, గణేష్, శివకుమార్, సాధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నేతలు

## సుందరయ్య పార్కు అభివృద్ధికి మరింత కృషి

**చిక్కడపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త :** నగరంలోనే ఆదర్శవంతమైన పార్కుగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కును అభివృద్ధి చేస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో రూ. 42.90 లక్షలతో నిర్మించి పూర్తి చేసిన ఓపెన్ జిమ్‌ను రామ్‌నగర్ కార్పొరే టర్ రవిచారితో కలిసి ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం డీఈ గీత, కాంట్రాక్టర్ మోసిన్, వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.పాండయ్య, సంతోష్‌గౌడ్, రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎంఎన్.రావు, రామ్‌నగర్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.మోజెస్, మన్నె దామోదర్‌రెడ్డి, వాకర్స్ ప్రతినిధులు బబ్లూ(వెంకటకృష్ణ), రాజేంద్రప్రసాద్‌గౌడ్, అయిలినేని కిషన్‌రావు, ఆర్.జయదేవ్, సిపిఐ ముషీరా బాద్‌నియోజకర్గం కన్వీనర్ బి.వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

## వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా సెయింట్ పాల్స్ విద్యార్థుల ర్యాలీ



వజ్రోత్సవాల సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కమ్మగూడలో వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా సెయింట్ పాల్స్ పాఠశాల అధ్వర్యంలో కౌన్సిలర్ కాకుమాను సునీల్‌తో కలిసి 500 మీటర్ల జాతీయ జెండాతో ఉపాధ్యాయుల, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విచ్చేసి కౌన్సిలర్లతో కలిసి సెయింట్ పాల్స్ స్కూల్ వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించి, తుర్కయంజాల్ చౌరస్తావద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహంవరకు జాతీయ జెండా తో ర్యాలీగా వెళ్ళి, అక్కడ బెలూన్లను ఎగురవేసి, జెండావిష్కరణ చేసారు. అనంతరం జాతీయ గీతం ఆలపించి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీగోపాల్‌రెడ్డి, నాయకులు గుండ్ల ధనరాజ్‌గౌడ్, ఎండి గౌసెపాషా, రాకేష్, సెయింట్ పాల్స్ చైర్మన్ ఫర్ ఆల్బర్ట్, ప్రిన్సిపాల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ సినిమాకు విశేష స్పందన : డిఇఓ


పోలీసు అధికారులను సన్మానిస్తున్న డిఇఓ రాధాకృష్ణ

**మలక్‌పేట, ఆగస్టు 22 ప్రభాతవార్త :** గాంధీజీ సినిమాకు విశేష స్పందన లభించిందని సైదాబాద్ మండల డిఇఓ రాధాకృష్ణ తెలిపారు. వజ్రోత్సవాల ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మూసారాంబాగ్ పివిఆర్ సినిమా హాల్‌లో పాఠశాల విద్యార్థులు గాంధీజీ సినిమాను తిలకించడానికి ఏర్పాటు చేసామని, మండల పరిధిలో సుమారు 9589 మంది విద్యార్థులు సినిమాను చూడడం జరిగిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం గురించి విద్యార్థులకు తెలియజేయడానికి ఈ చిత్రం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన మలక్‌పేట పోలీస్ స్టేషన్ డిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ జయంత్, మలక్‌పేట ఆర్టీఓ ఎంవిఐ రమేష్‌బాబు, మేనేజర్ శేఖర్‌లను అభినందించి ఘనంగా శాలువాతో సన్మానించారు.

## తార్నాకలో ఉత్సాహంగా యువత రక్తదానం


రక్తదాన శిభిరంలో డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, రామచందర్‌రావు

**తార్నాక, ఆగస్టు 22 ప్రభాతవార్త:** రక్తదానం ప్రాణ దానంతో సమానం అని నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు పేర్కొన్నారు. టీఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, చిరంజీవి అభిమానులు తార్నాక చౌరస్తా మెగా రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిభిరాన్ని శ్రీలతశోభన్‌రెడ్డి, రామచందర్ రావు, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తం లభించక ఎంతో మంది అవస్థలు పడుతున్నారని వారి కోసం ఇలాంటి శిభిరాలు ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. రక్త దానం చేసిన యువతను వారు అభినందించారు. అఖిల భారత చిరంజీవి యువత ఫ్యాన్స్ అధ్యక్షులు స్వామినాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ రక్త దాన శిభిరంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, బిజెపి నాయకులు వెంకటేష్‌గౌడ్, టీటీడీ మెంబర్ సుఖెందర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, శివశంకర్, క్రిష్ణ, వరికుప్పల శ్యామ్, డెంజిల్, సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో కార్పొరేటర్ పర్యటన


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్ పరిధిలోని కామాక్షిపురం, ప్రగతినగర్ కాలనీలో సోమవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కామాక్షిపురంలో రోడ్డు సమస్య గురించి కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. డివిజన్ ప్రజలకు మౌళిక సదుపాయలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, ఎఇ జ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, డివిజన్ కార్యదర్శులు సంకూరి కుమారస్వామి, నారాయణదాసు, తుమ్మలి రవి, పి.అంజయ్య, మనోహర్, రత్నంచారి, లింగం తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**నేరెడ్‌మెట్ ఆగస్టు 22 ప్రభాతవార్త:** నిరుపేదలకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మైనంపల్లి సోషల్ సర్వీస్ సభ్యులు, టిఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఆర్.కె పురం వడ్డెర బస్తికి చెందిన లక్ష్మమ్మ గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మైనంపల్లి సోషల్ సర్వీస్ సభ్యులు చైర్మన్ మైనంపల్లి రోహిత్‌కు తెలియజేయడంతో వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా వెంటనే రూ. 10వేలను మల్కాజిగిరి టిఆర్ఎస్ సర్కిల్ ఉపాధ్యక్షులు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎస్సార్ ప్రసాద్ చేతులమీదుగా అందించాలని తెలిపారు. నిరుపేదలమైన తమకు అండగా నిలిచి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించిన మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో గుడ్లు అందించాలి : మల్‌రెడ్డి రాంరెడ్డి


ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మల్‌రెడ్డి రాంరెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కోడి గుడ్లు ఎందుకు పెట్టడం లేదో ప్రభుత్వం చెప్పాలని ఎల్‌బినగర్ కాంగ్రెస్ ఇంఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. చంపాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాంరెడ్డి సోమవారం కర్మన్‌ఘాట్‌లోని జడ్పిహెచ్ఎస్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో కోడి గుడ్లు పెట్టకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బడిలో కోడిగుడ్డు మాయమనే కార్యక్రమాన్ని చేపడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నామన్నారు. తాము వస్తున్న విషయాన్ని గ్రహించి జడ్పిహెచ్ఎస్‌లో 300 గుడ్లు తెచ్చారని అయితే విద్యార్థుల సంఖ్య మాత్రం 432 ఉందన్నారు. మిగతా 132 గుడ్లు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ప్రైమరీ స్కూల్‌ను కూడా ఆయన పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అక్కడి పిల్లలకు తామే గుడ్లు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మతీన్, నారాయణ, దిలీప్‌రెడ్డి, ఉమేష్, కిరణ్, లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారాల సమస్యల పరిష్కారానికి కృషి: మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ్మారెడ్డి


తీజ్ ఉత్సవంలో బంజార మహిళలతో మేయర్ చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** బంజారాల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సహకరిస్తానని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన తీజ్ ఉత్సవాల ముగింపు వేడుకలకు పారిజాత ముఖ్య అతిథిగా హాజరై బంజారా మహిళలతో కలిసి కొద్ది సేపు సాంప్రదాయ నృత్యం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బంజారాలు తమ సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోకుండా కాపాడుకోవడం సంతోషకరమని అన్నారు. బంజారాలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శంకర్ రాథోడ్, రామారావు చౌహాన్, శ్రీనివాస్ రాథోడ్, గోవర్ధన్, అనూష బాయి, లక్ష్మణ్, జేత్రమ్, సురేష్ రాథోడ్, రాజు నాయక్, వనతి, రాందాస్, భాజీ సింగ్, పాండు, నాగు, సీతాబాయి, సక్కుబాయి, మన్య నాయక్, సుభాష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షాకు బిజెపి కార్పొరేటర్ల ఘన వీడ్కోలు

**సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** తెలంగాణలో మునుగోడు పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకొని ఢిల్లీ తిరిగి వెళ్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన పలువురు బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో అమిత్ షాను కలిసిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు గూడెపు ఇంద్రసేన, దడిగ శంకర్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డిలతో పాటు పలువురు ఆయనను శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు.

## ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో వజ్రోత్సవాల ముగింపు వేడుకలు

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 75వ స్వతంత్ర వజ్రోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురా ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు తగు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది త్యాగాలఫలితమే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధాకర్‌శెట్టి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కరిపె సంతోష్‌కుమార్, పుప్పాల వెంకటేశ్వర్లు, సాయిబాబా, ఎన్ఎస్‌యుఐ వినయ్, మహేందర్, సూరి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడ టెక్నికల్ డిఇగా సూర్యనారాయణ

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ ఇంజనీర్ టెక్నికల్‌గా సూర్యనారాయణ నియమితులైయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న టెక్నికల్ డిఇ ప్రభాకర్‌రెడ్డిని మింట్ కంపౌండ్ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయగా, ఆయన స్థానంలో సికింద్రాబాద్‌లో పనిచేస్తున్న సూర్యనారాయణను నియమించారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిఇ సూర్యనారాయణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా కలిసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం నేతలు బొబ్బల వెంకట్‌రెడ్డి, గరిక సుధాకర్, మేకల ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్ఎన్‌యుఆర్ఎంలో మంచినీటి కొరత


కాలనీవాసులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి నర్సింహ్మా తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్మెట్ గ్రామంలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో మంచినీటి కొరత తీవ్రంగా ఉంది. కొన్ని బ్లాక్‌లకు, మంచినీళ్లు పైకి ఎక్కకుండా కిందనే పట్టుకుంటున్నారు. కాలనీలో 12 లక్షల లీటర్లు పట్టే ట్యాంక్ నిర్మించారు. ప్రతిరోజు ఆరు లక్షల లీటర్లు కాలనీకి రావాలి. అలా కాకుండా రోజు లక్ష లీటర్లు, మరో రోజు లక్ష నుండి రెండు లేదా మూడు లక్షల లీటర్ల వరకే రావడంతో కొన్ని బ్లాకులోకి సుమారు 15 రోజుల నుండి నీళ్ల రాకుండా ఇబ్బంది పడుతున్నారు. దాదాపుగా ఈ కాలనీలో 3000 కుటుంబాల వరకు నివాసముంటున్నారు. వీరికి సరిపడే మంచినీళ్లు అందజేయాలని సిపిఎం అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. లేని యెడల బిందెలతో ప్రదర్శన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుండె శివ, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## డబ్బాలు తొలగించారు... శిథిలాలను విస్మరించారు

**హయత్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** హయత్‌నగర్‌నుంచి కుంట్లూర్ వెళ్లే దారిలో ట్రాఫిక్ ఇబ్బందులను సాకుగా చూపుతూ చిరువ్యాపారుల డబ్బాలను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు అక్కడి శిథిలాలను మాత్రం అలాగే వదిలివేయడంతో సమస్య ఎప్పటిలాగానే కొనసాగుతోంది. కుంట్లూర్ రోడ్డులో జాతీయరహదారి మొదలుకుని ఆసుపత్రివరకు పదుల సంఖ్యలో చిరు వ్యాపారులు రెండు దశాబ్దాలుగా డబ్బాలు ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాలను కొనసాగిస్తుండగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న ఫిర్యాదులో మార్చి మూడోవారంలో జీహెచ్ఎంసీ అధికారులు పోలీసు బందోబస్తునడుమ డబ్బాలను తొలగించారు. ఆసమయంలో వ్యాపారులకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి తోపాటు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వ్యాపారులకు అండగా ఉంటామని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటే అధికారులతో మాట్లాడి డబ్బాల ఏర్పాటుపై అధికారులతో మాట్లాడతామని హామీనిచ్చారు. ప్రజా ప్రతినిధుల హామీ అమలు సంగతలా ఉంచి ఇప్పటి వరకు రోడ్డుపక్కన శిథిలాలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సదరు శిథిలాల కారణంగా ఇప్పుడుకూడా ట్రాఫిక్ ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారుల లక్ష్యం నెరవేరక పోగా వ్యాపారులు మాత్రం జీవనోపాధి కోల్పోయి ఇబ్బందుల పాలవుతున్నారు. రోడ్డుపక్కన శిథిలాలు ఉండడంతో వాటిపక్కన వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల సమస్య యదావిధిగా కొనసాగుతోంది. ఆటోవాలల పరిస్థితి చెప్పనక్కరలేదు. ఇష్టారాజ్యంగా రోడ్డుపై ఆటోలను పార్క్ చేస్తున్నారు. కొందరు వ్యాపారులు ధైర్యం చేసి తమ వ్యాపారాలను అక్కడే నిర్వహిస్తున్నారు. ఇక ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న మండల పరిషత్ ఆవరణలోని ఎస్‌బీఐ ప్రహారీని తొలగించడంతో మాత్రం జీహెచ్ఎంసీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని వ్యాపారులు మండిపడుతున్నారు. ఎస్‌బీఐ ప్రహారీతో పాటు రోడ్డుపక్కన డబ్బాల శిథిలాలను వెంటనే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు ఆక్రమించి నిర్మించిన ఎస్‌బీఐ ప్రహారీగోడ

కుంట్లూర్ రోడ్డులో డబ్బాలు తొలగించన ప్రాంతంలో శిథిలాలు

## హిందూ ఏకతా సదస్సుకు భారీగా తరలిరండి

**వనస్థలిపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త :** వనస్థలిపురం, పనామా చౌరస్తా వద్ద గల బొమ్మిడి లలితా గార్డెన్‌లో మంగళవారం సాయంత్రం హిందూ ఏకతా సదస్సు నిర్వహిస్తున్నట్లు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, ఎల్‌బినగర్ అసెంబ్లీ కో కన్వీనర్ ఎం.వెంకన్న తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టుముందు సరైన వాదనలు వినిపించకపోవడం కారణంగా వచ్చిన తీర్పులపై గణేష్ నిమజ్జనోత్సవానికి అనేక ఆటంకాలు కలుగుతున్నాయని, వీటిని చట్టపరంగా అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన న్యాయపరమైన ధార్మిక హక్కును కాపాడాలని మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్న హిందూ ఏకతా సదస్సులో భారీగా పాల్గొనాలని గణేష్ ఉత్సవసమితి పిలుపునిచ్చింది. ఈ సదస్సులో ఉడిపి పెజావర్ పీఠాధిపతి శ్రీ విశ్వప్రసన్న తీర్థస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలి పారు. కార్యక్రమానికి విహెచ్‌పి, గణేష్ ఉత్సవ సమితి నాయకులతోపాటు హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు.

## ఘనంగా వెంకట్రామ్‌రెడ్డి జయంతి వేడుకలు


మాజీ కొత్వాల్ రాజబహదూర్ వెంకట్రామ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బేతి, రెడ్డి సంఘం నేతలు

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** నగర మొదటి కొత్వాల్ రాజబహదూర్ వెంకట్రామ్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం హబ్సిగూడలో ఘనంగా నిర్వహించారు. కెప్టెన్ వీరరాజిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ రాజబహదూర్ వెంకట్రామ్‌రెడ్డి తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎంతో మంది పేద విద్యార్థులకు విద్య, ఉపాధి కల్పించాలని కొనియాడారు. ఈ సందర్భంగా కెప్టెన్ వీరరాజిరెడ్డి ఫౌండేషన్ కోసం స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే బేతికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ రెడ్డి సంఘం సభ్యులు మల్లారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ముత్యంరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, టిఆర్ఎస్ నేతలు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, సూరం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం యాదవ్‌కు మంత్రి పరామర్శ


శ్రీశైలం యాదవ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** తీవ్ర అస్వస్థతకు గురై కోలుకుంటున్న బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్, నాదర్‌గుల్ సీనియర్ నాయకుడు యాతం శ్రీశైలం యాదవ్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఛైర్మన్‌గా పని చేసిన అనంతరం 2020లో వచ్చిన బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఎన్నికల తర్వాత ఉన్నఫలంగా తీవ్ర అస్వస్థతకు గురైన యాదవ్ ఆసుపత్రుల పాలై చికిత్స పొంది గత కొద్ది నెలల నుండి ఇంట్లో ఉంటూ కోలుకుంటున్నాడు. అయితే నాదర్‌గుల్ పర్యటనకు వచ్చిన మంత్రి యాదవ్ నివాసానికి వెళ్ళి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పన్నాల కృష్ణారెడ్డి, అంకంగారి కుమార్‌గౌడ్, దండు యాదయ్య, పెద్దబావి నాగ నందీశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాలాపూర్‌లో శతాధిక వృద్ధురాలు కళ్ళెం అడివమ్మ మృతి

**సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కళ్ళెం అడివమ్మ మృతి చెందారు. 102 సంవత్సరాలు ఉన్న ఈమె బాలాపూరేకాకుండా పరిసర గ్రామాల్లోనే అత్యంత వయో వృద్ధురాలు. సోమవారం ఉదయం ఆమె వృద్ధాప్య అనారోగ్యకారణాలతో బాలాపూర్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. ఈమెకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మనుమరాలైన భీమిడి స్వప్న జంగారెడ్డి ప్రస్తుతం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా అదే విధంగా మనుమడైన కళ్ళెం లక్ష్మారెడ్డి బాలాపూర్‌లోని బండ్లగూడ వ్యవసాయ పరపతి సహకార సంఘం డైరెక్టర్‌గా మరో మనుమడు కళ్ళెం శ్రీధర్‌రెడ్డి బాలాపూర్ వేణుగోపాల స్వామి టెంపుల్ ధర్మకర్తగా ఉన్నారు. కాగా మృతి చెందిన అడివమ్మకు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, రాష్ట్ర బిజెపి నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కళ్ళెం ఎల్లారెడ్డి, ఎర్ర జైహింద్, భీమిడి జంగారెడ్డి, టేకుల శశిధర్‌రెడ్డిలతో పలువురు గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు బాలాపూర్ స్మశానవాటికలో జరిగాయి.

## మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలి: మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** ఆసుపత్రులకు వచ్చే రోగులకు మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందిచాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్ సాగర్ రోడ్డులోని జీవన్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసియు, ఆపరేషన్ థియేటర్‌ను సోమవారం ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజులతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినప్పుడే ఆసుపత్రులకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఎండి రమేష్‌బాబు, డాక్టర్ దుర్గారాణి, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితునికి ఎంపి రంజిత్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం


ఎంపి తరపున రూ.లక్ష నగదును అందజేస్తున్న చలువాది రాజేష్ తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హస్తినాపురంలోని నవీన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరం మండల నమస్తే తెలంగాణ విలేఖరి బంటు వెంకటేశ్‌కు చేవెళ్ళ ఎంపి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అండగా నిలిచారు. ఈ మేరకు వెంకటేశ్ వైద్య చికిత్స కోసం తక్షణ సాయం కింద రూ.లక్షను అందజేశారు. సోమవారం ఉదయం ఎంపి తరపున ఆసుపత్రికి వచ్చిన మీర్‌పేట్ మాజీ ఎంపిటిసి, సీనియర్ నాయకుడు చలువాది రాజేష్, కార్పొరేటర్ పిడుగు ప్రమీల యాదగిరి ముదిరాజ్, మాజీ ఎంపిటిసిలు దేరంగుల యాదయ్య, బొబ్బిలి కిరణ్‌గౌడ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బేర బాలకిషన్ తదితరులు ఆసుపత్రికి వచ్చి వెంకటేశ్‌ను పరామర్శించి రూ.లక్ష నగదును అందజేశారు.

## సకాలంలో ఫ్లోరింగ్ పనులు పూర్తి : గీత


కార్పొరేటర్ గీత ప్రవీణ్, అధికారులను సత్కరిస్తున్న కాలనీ సంఘం నేతలు

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** చిలుకానగర్ మర్ల మైసమ్మ ఆలయం, నాగదేవత ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా చేపట్టిన ఫ్లోరింగ్ పనులు సకాలంలో పూర్తి చేసినట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం చిలుకానగర్ దేవాలయం కమిటి సభ్యులు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తోపాటు, డిప్యూటి ఇంజనీర్ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఆలయంలో సిమెంట్ ఫ్లోరింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, జెల్లి మోహన్, సకినాల ప్రసాద్, మాస శేఖర్, బింగి శ్రీనివాస్, ప్రసాద్, దేవాలయ కమిటి సభ్యులు గౌరయ్య, గణేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు: అరుణ


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తగినచర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆంధ్రాబ్యాంకు కాలనీ, శంకేశ్వర్ బజార్‌లలో డ్రైనేజీ సమస్యలు తలెత్తడంతో సంబంధిత సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కరింప చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులపట్ల అధికారులు అప్రమత్తంగా ఉండి సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 22 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ డివిజన్‌లో డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సీనియర్ బిజెపి నాయకుడు బొక్క మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని వెస్ట్ ప్రశాంత్‌నగర్ అంబేద్కర్ బస్తీ, సాయిలు హట్స్, తదితర ప్రాంతాల్లో జలమండలి మేనేజర్ చంద్రునాయక్, జిహెచ్ఎంసి సైట్ ఇంజనీర్ ఏడుకొండలు తదితరులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీలైన్, రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేసి, మ్యాన్‌హోల్స్ ను పునరుద్దరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా మూసారాంబాగ్ బస్తీలో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించి వినాయక చవితి నేపథ్యంలో పనులు త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, యాదగిరి, సంతోష్, ప్రవీణ్‌యాదవ్, దినేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.